ప్రజాశక్తి

బుధవారం 5 జులై 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

ఇంటర్ పై ఇంట్రస్ట్ ఏదీ?

హైస్కూల్ ప్లస్‌లో మౌలిక వసతులు కరువు



ఇంటర్ నిర్వహణకు ఎంపికైన ప్రత్తిపాడు జెడ్‌పి పాఠశాల

ఈ ఏడాదీ నామమాత్రంగానే అడ్మిషన్లు

ప్రజాశక్తి-గుంటూరు

ఎంపిక చేసిన హైస్కూల్స్‌లో బాలికల కోసం హైస్కూల్ ప్లస్ పేరుతో ఏర్పాటు చేసిన ఇంటర్ విద్యపై ప్రభుత్వం ఈ ఏడాది కూడా అశ్రద్ధ కనబరుస్తోంది. ఇంటర్ విద్యనైతే ప్రారంభించారు. వాటిల్లో విద్యార్థుల చేర్పింపు, ల్యాబ్‌లు, ఇతర మౌలిక వసతుల కల్పనను ప్రభుత్వం మరిచింది. కనీసం ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇవ్వలేదు. గతేడాది ఆలస్యంగా ప్రారంభం అయ్యాయని, వచ్చే ఏడాది పూర్తి స్థాయిలో సిద్ధం చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇంత వరకూ చర్యలు తీసుకోలేదు. దీంతో ఆ ప్రభావం ఫలితాలపె, ప్రస్తుత అడ్మిషన్లపై పడింది. ముఖ్యంగా కనీస వసతులు కానీ, ఉపాధ్యాయులకు తగిన శిక్షణ కానీ ఇవ్వలేదు.ఇదిలా ఉంటే ఉన్న వాటిని అభివృద్ధి చేయకుండా, మండలానికి రెండు కాలేజిలు ఏర్పాటు చేయటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవటం శోచనీయం. గత సంవత్సరం గుంటూరు జిల్లాలో 15 హైస్కూల్స్‌లో బాలికల కోసం ఇంటర్ విద్యను ప్రారంభించారు.ఎంపిసి, బైపిసి, సిఇసి కోర్సులను ప్రవేశపెట్టారు.

గతేడాది అన్ని కాలేజీల్లో కలిపి 201 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. సాధారణ ఇంటర్ కాలేజిల అడ్మిషన్ల కంటే చాలా ఆలస్యంగా బాలికల కాలేజీలు ప్రారంభించారు. దీంతో టెన్త్ తప్పిన వారు, పై చదువులు మానేసిన వారు మాత్రమే నామమాత్రంగా చేరారు. ఈ ఏడాదైనా మార్పు వస్తుందనుకుంటే ఎలాంటి మార్పూ లేదు. ఈ సంవత్సరం కూడా ఇంటర్ ప్రధమ సంవత్సరంలో 216 మంది మాత్రమే చేరారు. వీరిలో ఎంపిసి గ్రూపులో 111 మంది, బైపిసిలో 94 మంది, సిఇసిలో 11 మంది చేరారు. కొన్ని పాఠాశాలల్లో మూడు, ఐదు వంటి సింగిల్ డిజిట్ అడ్మిషన్లు జరిగాయి. అంకిరెడ్డిపాలెం, కొల్లిపర హైస్కూల్స్ ఇంకా ఒకటిరెండు చోట్ల మాత్రమే అడ్మిషన్లు కొంచెం మెరుగ్గా ఉన్నాయి. అంకిరెడ్డిపాలెంలో 20 మంది, కొల్లిపరలో 15 మంది విద్యార్థినులు చేరారు. గత సంవత్సరం అడ్మిషన్లు లేని నారాకోడూరు, కొప్పర్రు జెడ్పీ హైస్కూల్స్‌కు ఈ ఏడాది అసలు ఉపాధ్యాయులనే

2లో





పోరుకేక...

'పోలవరం నిర్వాసితుల పోరుకేక' రాష్ట్ర రాజధాని ప్రాంతం విజయవాడలో హోరెత్తింది. నగరంలో ఎర్ర సైన్యం కథం తొక్కింది. ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలు, ఎర్ర జెండాలు, మెడలో ఎరుపు, ఆకుపచ్చ కండువాలతో మంగళవారం వందలాది మందితో సాగిన ప్రదర్శన ఆకట్టుకుంది. కొమ్ము తలపాగాలు, చేతిలో డోలు వాయిద్యాలతో గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా చేసిన నృత్యాలతో ముందుకు సాగింది. ఈ యాత్ర డాబాకొట్లు సెంటరు నుండి సభా స్థలికి చేరుకునేందుకు మూడున్నర గంటల సమయం పట్టింది. ఫుడ్ జంక్షన్ సెంటర్లో రేలా రేలా అంటూ ఆదివాసీ గిరిజన మహిళలతో కలిసి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు కొమ్ము తలపాగాలు ధరించి చేసిన నృత్యాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. నగరంలో మొత్తం 4.5 కిలో మీటర్లు సాగిన ఈ యాత్ర ఆద్యంతం ఎంతో ఉత్సాహంగా సాగింది. అనంతరం జరిగిన సభకు వేలాదిగా తరలివచ్చిన జనంతో ధర్నా చౌక్ రోడ్డు కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ 'పోలవరం పోరుకేక' ఆరంభం మాత్రమేనని, నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం సాగిస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. 15 రోజుల్లో స్పందించకపోతే మరో పోరాటానికి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. నేతలు, కార్యకర్తలు, నిర్వాసితులు చివరి వరకూ ఉండి సభను విజయవంత చేశారు. దీనికితోడు వాతావరణం కూడా సహకరించింది. తొలుత కాస్త తుంపర్లు పడినా తర్వాత తెరిపిచ్చింది. జూన్ 20వ తేదీన నెల్లిపాకలో ప్రారంభమైన మహా పాదయాత్ర మంగళవారం విజయవాడలో ముగిసింది.

(పూర్తి వివరాలు మెయిన్, టాబ్లాయిడ్ లోపలి పేజీల్లో)

మన్యం వీరుడు అల్లూరికి ఘన నివాళి 2 లో



మైనింగ్ ప్రదేశంలో ధర్నా చేస్తున్న పెదగార్లపాడు గ్రామస్తులు, సిపిఎం నాయకులు

చెట్టినాడ్ మైన్స్‌లో బాధితుల ధర్నా

- అక్కడే వంటావారు - 10 గంటలపాటు ఆందోళన
- పేలుళ్లతో తమ ఇళ్లు బీటలు వారుతున్నాయని ఆగ్రహం
- శాశ్వత పరిష్కారం కోసం డిమాండ్
- రెండు దఫాల చర్చల అనంతరం రాతపూర్వక హామీతో విరమణ

ప్రజాశక్తి - దాచేపల్లి

ఒకవైపు ఇళ్లు బీటలు వారుతుంటే మరోవైపు తమను మభ్యపెట్టేలా చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం వ్యవహరిస్తోందని మండలంలోని పెదగార్ల పాడు గ్రామస్తులు మండిపడ్డారు. ఫ్యాక్టరీ మైన్స్‌లో మంగళవారం ఆందోళన చేపట్టారు. అక్కడే వంటావార్పు చేశారు. 10 గంటల ఆందోళన, రెండు దఫాల చర్చల అనంతరం 15 రోజుల సమయం ఇవ్వాలని కంపెనీ ప్రతినిధులు రాతపూర్వకంగా కోరడంతో అందుకు అంగీకరించి ఆందోళన విరమించారు.

చెట్టినాడు సిమెంటు ఫ్యాక్టరీ మైన్‌లో జరిగే పేలుళ్ల వల్ల తమ ఇళ్లు బీటలు వారుతున్నాయని గ్రామస్తులు రెండేళ్లుగా ఆందోళనకు గురవుతున్నారు. దీనిపై యాజమాన్యం, ప్రభుత్వ అధికారులకూ పలుమార్లు విన్నవించారు. అయినా సరైన స్పందన కరువైంది. ఈ నేపథ్యంలో రెండ్రోజుల కిందట కంపెనీ ప్రతినిధులు గ్రామానికి వచ్చి ఒక్కో ఇంటికి 10 కట్టల సిమెంట్, ఇసుకను ఇస్తామని, వాటితో మరమ్మతు చేయించుకోవాలని చెప్పారు.

2లో



సమీక్షలో మాట్లాడుతున్న జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్

జిజిహెచ్‌లో 200 ఖాళీలు

భర్తీ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు : సూపరింటెండెంట్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో ఆరేడేళ్లుగా ఖాళీగా ఉన్న 200 నాలుగో తరగతి ఉద్యోగ పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్ కుమార్ నిర్ణయించారు. ఈ మేరకు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉమాజ్యోతి, నాట్కో క్యాన్సర్ విభాగం హెచ్ఒడి డాక్టర్ దుర్గా ప్రసాద్, వైద్యులతో మంగళవారం సమీక్షించారు. ఈ పోస్టులను ఇప్పటి వరకూ భర్తీ చేయకపోవడానికి గల కారణాలపై చర్చించారు. ఈ పోస్టుల భర్తీ విషయంలో ఎవరూ ఎందుకు స్పందించలేదో, ఆసలు ఈ పోస్టులు ఉన్నాయో లేదో తెలియదు. నియామకాలు

2లో

ఐదు నెలల గర్భిణి మృతి

ఆస్పత్రి ఎదుట బంధువుల ధర్నా 2 లో



ఐతానగర్-నేలపాడు రోడ్డులో పొలాల్లోకి చేరిన వర్షపు నీరు

ఖరీఫ్‌లో తొలి ఎదురుదెబ్బ

వానతో సముద్రాన్ని తలపిస్తున్న పొలాలు - వెదవరి పాడవుతుందని రైతుల ఆవేదన

ప్రజాశక్తి-తెనాలి/తెనాలిరూరల్

నిన్న మొన్నటి వరకూ అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలను ఉక్కిరి బికిరి చేసిన వాతావరణం.. ఋతుపవనాల రాకతో చల్లబరిచింది. ఆ అనుభూతి పొందుతుండగానే ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షం పంట పొలాలను, పట్టణంలోని పలు ప్రాంతాలను ముంచెత్తింది. ఖరీఫ్‌లో వెదపద్ధతిలో వరి సాగుకు శ్రీకారం చుట్టిన రైతులు భారీ వర్షానికి విత్తనం మొలకెత్తదని, ఆదిలోనే నష్టపోతున్నామని వాపోతున్నారు.

ఖరీఫ్ సీజన్‌లో వర్షం కోసం ఎదురు చూసిన రైతులు సకాలంలోనే వానలతో ఆనందంగా సాగుబాట పట్టారు. ఖరీఫ్‌లో కృష్ణా పశ్చిమ డెల్టా రైతులు అధికశాతం వరి సాగు చేస్తున్నారు. మారుతున్న వ్యవసాయ పద్ధతులకు అనుగుణంగా సాగు ఖర్చులు తగ్గించుకునేందుకు వరిని వెదపద్ధతిలో సాగు చేస్తున్నారు. ఇప్పటికే అధికశాతం రైతులు ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం నుంచి ప్రారంభమైన వర్షం మంగళవారమూ కురుస్తుండటంతో పొలాలు జలాశయాలను తలపిస్తున్నాయి. తెనాలి చుట్టుపక్కల ప్రాంతాలైన ఐతా నగర్ శివారు. నేల పాడు, బుర్రిపాలెం

2లో

ఐదు నెలల గర్భిణి మృతి

ఆస్పత్రి ఎదుట బంధువుల ధర్నా


ప్రజాశక్తి - వినుకొండ : వైద్యుల నిర్లక్ష్యం కారణంగా గర్భిణి మృతి చెందిందని మృతదేహంతో ఆస్పత్రి ఎదుట బంధువులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఈపూరు మండలం కొచ్చర్లకు చెందిన కర్రా అనూష (20)కు 10 నెలల కిందట వివాహమైంది. ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భిణి కావడంతో గతంలోనే పుట్టింటికి వచ్చి వినుకొండలోని కీర్తి థియేటర్‌కు వెళ్లే మార్గంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటోంది. రక్త హీనత ఉందని చెప్పిన వైద్యులు కొన్ని మందులు ఇస్తూ వచ్చారు. అయితే మంగళవారం పరీక్షించగా రక్త పరిమాణం ఐదు శాతమే ఉందని, చికిత్స అవసరమని రక్తం ఎక్కించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు వైద్యశాలకు తరలించాలని సూచించారు. గుంటూరుకు తరలించగా ఆమె చనిపోవడంతో ఆ మృతదేహాన్ని వినుకొండలోని ఆస్పత్రి ఎదుటకు తెచ్చి బంధువులు ధర్నా చేపట్టారు. కొద్దిసేపు ఆందోళన అనంతరం ఆస్పత్రి యాజమాన్యం, పోలీసులు, వైసిపి నాయకులు చర్చించి బాధితులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

సంస్కారం లేని వాళ్లలా యరపతినేని బూతులు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : సంస్కారం లేని వాళ్లలా బూతులు మాట్లాడుతున్నారని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుపై గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మండిపడ్డారు. యరపతినేని ఇటీవల చేసిన విమర్శలకు స్పందిస్తూ మంగళవారం ఆయన స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. అధికారంలో ఉన్నంతకాలం అభివృద్ధి పనులు చేయకుండా ఇప్పుడు తొడలు కొట్టడం, మీసాల తిప్పటం ఏమిటని ప్రశ్నించారు. గురజాలలో ప్రభుత్వాస్పత్రిని జంగా కృష్ణమూర్తి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కట్టారని, మాచవరం వైద్యశాల కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో నిర్మించారని చెప్పారు. నియోజకవర్గంలో రూ.2518 కోట్లతో తాగు నీటి సౌకర్యం రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం, జాతీయ రహదారులు, గురజాల, దాచేపల్లి మున్సిపాలిటీలు చేశామని చెప్పారు. ఇవన్నీ అబద్ధమని నిరూపిస్తే తాను రాజకీయాల నుండి వైదొలగుతానని, నిరూపించలేకుంటే ఆయన తప్పుకుంటారా? అని సవాలు విసిరారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కె.ముక్కంటి, జయాలుద్దీన్, నాయకులు సిహెచ్.రామారావు, సిహెచ్.పిచ్చిరెడ్డి, ఎం.సుదీర్ ఉన్నారు.

పలుచోట్ల కొణిజేటి రోశయ్య జయంతి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా విలేకర్లు: కొణిజేటి రోశయ్య రాష్ట్రానికి చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మాజీ మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 90వ జయంతి సందర్భంగా సత్తెనపల్లి పట్టణంలోని గాంధీ బొమ్మలు సెంటర్లో రోశయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ కూడా నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జయంతి సభ నిర్వహించారు. నరసనావుపేట శివునిబొమ్మ సెంటర్‌లోని రోశయ్య విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పూలమాలలేశారు. పల్నాడు అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.రమేష్, స్టేట్ బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు కె.విజయకుమార్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఊరా భాస్కరరావు, తదితరులు నివాళులర్పించారు. 90 మంది పేద కుటుంబాలకు నిత్యావసరాలను, 90 మంది విద్యార్థులకు పుస్తకాలను, 90 మంది వృద్ధ మహిళలకు దుప్పట్లు అందించగా 90 మంది యాచకులకు అన్నదానం చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు అలెగ్జాండర్ సుధాకర్ తదితరులు నివాళులర్పించారు. మాచర్లలో రోశయ్య విగ్రహనికి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పూలమాలలేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి నివాళులర్పించారు.



సత్తెనపల్లిలో నివాళులర్పిస్తున్న మంత్రి రాంబాబు తదితరులు

మన్యం వీరుడు అల్లూరికి ఘన నివాళి

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా మంగళవారం గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టరేట్లలో అల్లూరి చిత్రపటానికి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలేసి నివాళులర్పించారు. గుంటూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, జెసి జి.రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణశర్మ నివాలులర్పించగా డిఆర్‌ఒ కె.చంద్రశేఖరరావు, డిప్యూటీ కలెక్టర్లు మోవిడి వాణి, సాయిశ్రీ, జెడ్‌పి సిఇఒ మోహనరావు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మధుసూదనరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణబాబు, జిల్లా భూగర్భ జలవనరులశాఖ ఉప సంచాలకులు వందనం, జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు సువార్త, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు, అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు. తొలుత నాజ్ సెంటరులోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి జిల్లా కలెక్టర్, వేణుగోపాల్ రెడ్డి, జిఎంసి కమిషన్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎం.శేషగిరిరావు, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురోషోత్తం పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. పల్నాడు కలెక్టరేట్‌లో కలెక్టర్‌తోపాటు డిఆర్‌ఒ వినాయకం, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి దుర్గాబాయి నివాళులర్పించారు. లింగంగుంట్ల అగ్రహారం పరిధిలో శంకర భారతిపురం జెడ్‌పి పాఠశాలలో, రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నివాళులర్పించగా కలెక్టర్‌తోపాటు రోటరీ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పూలమాలేశారు. ఎఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, ఎఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ,



గుంటూరులో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, నగర కమిషనర్ తదితరులు



ఎఎఒ రామారావు పాల్గొన్నారు. రెంటచింతల మండలం సత్రశాలలోని నాగార్జునసాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు వద్ద చిత్రపటానికి ఎస్ఈ వెంకటరమణ పూలమాలు వేశారు. మాచర్ల పట్టణంలో శ్రీ రామక్రిష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 122వ వర్ధంతి, అల్లూరి సీతారామరాజు 125వ జయంతి మంగళశారం నిర్వహించారు. వారి చిత్రపటాలకు రూరల్ సిఐ సమీముల్లా , మున్సిపల్ కమీషనర్ ఇవి రమణబాబు పూలమాలలు వేశారు. సేవా సమితి అధ్యక్షులు ఎం.గోవిందరెడ్డి, నాగూర్‌వలి, పి.పుల్లారావు, సిహెచ్ వెంకటేశ్వరరెడ్డి, చినలాల్‌సాహెబ్, జి.నరసింహారావు, మల్లయ్య, చంద్రారావు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో తొలి ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

పొలాల్లోకి పెద్దఎత్తున నీరు చేరడంతో వెద పెట్టిన వరి ఉరకెత్తి పోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగులో ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.8 నుంచి రూ.10 వేల వరకూ ఖర్చు చేయగా ప్రారంభంలోనే ఎదరుదెబ్బ తలిగిందని రైతులు అంటున్నారు.

కాల్వలు పూడిక తీయకనే..

వేసవిలో సాగు నీటి కాల్వలు పూడిక తీయించాల్సిన అధికారులు మిన్నకున్నారని, ఫలితంగా నీటి పారుదలకు కాల్వలు అనుకూలంగా లేకపోవటంతో పొలాల్లోనే నీరు నిలిచిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజుల క్రితం రైతు సంఘం ప్రతినిధి బృందం పంట కాల్వలను పరిశీలించింది. ఐతానగర్, పెదరావూరు, జగ్గడిగుంటపాలెం ప్రాంతాల్లో పర్యటించి, కాల్వలు పూడుకుపోవటం గమనించిందింది. ఖరీఫ్ తరుణం ఆసన్నమైన నేపథ్యంలో కాల్వలు పూడిక తీయించాలని అధికారులను రైతు నాయకులు డిమాండ్ చేశారు. పూడిక తీయకుంటే ప్రస్తుత పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరించారు. అయినా అధికారుల్లో స్పందన లేమి ఇప్పుడు నష్టం తెచ్చింది.

కల్వర్టు నిర్మాణమూ కారణమే..

ఐతానగర్, నేలపాడు ప్రాంతంలోని పొలాల్లో నీరు నిలవడానికి కల్వర్టు నిర్మాణం కూడా కారణంగా రైతులు చెబుతున్నారు. జగనన్న కాలనీ వద్ద పంట కాల్వపై ఓ కల్వర్టు నిర్మాణాన్ని అధికారులు మూడు నెలల క్రితం ప్రారంభించారని, దీంతో అక్కడ కాల్వను పూడ్చి వేయటంతోనే నీరు పొలాల్లోకి ఎగదన్నిందని ఐతానగర్‌కు చెందిన కౌలు రైతు మేకల చిట్టిబాబు చెబుతున్నారు.

బస్టాండ్‌తో సహా పలు ప్రాంతాలు జలమయం

సోమవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి



ఆర్టీసి బస్టాండ్‌లో చేరిన వర్షపు నీరు

లేకుండా కుండపోత వర్షానికి పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆర్టీసి బస్టాండ్ ఆవరణలో పెద్ద ఎత్తున నీరు చేరింది. తెనాలి నుంచి విజయవాడ, మంగళగిరి వైపు వెళ్లే బస్సులు నిలిపి ఉంచే ప్రాంతంలో భారీగా నీరు చేరి ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సు ఎక్కాలన్నా, దిగాలన్నా మహిళల ఇబ్బందులు వర్ణనాతీతం. బోస్‌రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి స్వరాజ్ కూడలి వరకు, చినరావూరు పార్కు మలుపులో, బుర్రిపాలెం రోడ్డులో, తహాశీల్దార్ కార్యాలయం ఎదురు రోడ్డులో వర్షం నీరు బారీగా నిలించి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

వైద్య సేవల వివరాలు అందరికీ తెలపండి

ప్రజాశక్తి - పెదకూరపాడు : పని విధానాన్ని మెరుగుపరుచుకోవాలని వైద్య సిబ్బందికి పల్నాడు జిల్లా వైద్యాధికారి (డిఎంహెచ్ఒ) శోభారాణి సూచించారు. మండలంలోని తాళ్లూరు పిహెచ్‌సిని ఆమె మంగళవారం పరిశీలించారు. అనంతరం వైద్యులు, ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలతో సమీక్షించారు. పిహెచ్‌సిలో చేసే అన్ని రకాల వైద్య పరీక్షలు గురించి అందరికీ తెలపాలని, సేవలను మెరుగు పర్చాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రియాంక, వెలిగొండ రెడ్డి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఇంటర్ పై ఇంట్రస్ట్ ఏదీ?

(మొదటి పేజీ తరువాయి)

కేటాయించలేదు. దీంతో ఆయా కాలేజిల్లో ఇంటర్‌లో ఒక్క విద్యార్థిని కూడా చేరలేదు.

మౌలిక సదుపాయాలేవి..

బాలికల కోసం ప్రత్యేకంగా ఇంటర్ విద్యను ప్రారంభించటంపై సర్వత్రా హర్షం వ్యక్తం అయ్యింది. అయితే వాటిని పూర్తి స్థాయిలో సిద్ధం చేయటంపై ప్రభుత్వానికి శ్రద్ధ లేదనే విమర్శలు వస్తున్నాయి. గతేడాది అసలు ఉపాధ్యాయులనే నియమించలేదు. ఈ ఏడాది నియమించినా ఇంత వరకూ శిక్షణ ఇవ్వలేదు. ఇప్పటి దాకా హైస్కూల్ బోధన చేసిన వారితోనే ఇంటర్ పాఠాలు చెప్పిస్తున్నారు. ఇంటర్ పరీక్షలకు, హైస్కూల్ పరీక్షలకు వ్యత్యాసం ఉంటుంది. అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో ఇంటర్ విద్యను బోధించాలి. కనీసం హైస్కూల్ ఉపాధ్యాయులకు తగిన శిక్షణ అయినా ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకు కాలేజిలు ప్రారంభించటానికి ముందుగానే ఉపాధ్యాయుల్ని నియమించి, వారికి శిక్షణ ఇవ్వాల్సి ఉన్నా ఆ విధంగా చేయలేదు. అలాగే కనీసం ల్యాబ్స్ ఏర్పాటు చేయకపోవటంతో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. ద్వితీయ సంవత్సరం నుండి ప్రాక్టికల్స్ చేయాల్సి ఉంటుంది. ప్రాక్టికల్స్‌కు ప్రత్యేకంగా మార్కులు కూడా కేటాయిస్తారు. కానీ ఒక్క హైస్కూల్లో కూడా ల్యాబ్స్ లేకపోవటంతో అయోమయంలో ఉన్నారు. కొన్ని చోట్ల సరైన తరగతి గదులు కూడా లేవు. కొన్ని చోట్ల నిర్మాణంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇంటర్ విద్యపై నిర్లక్ష్యంపై అటు తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయుల్లోనూ విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా తగిన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జిజిహెచ్‌ల 200 ఖాళీలు

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించినా భర్తీ చేయలేక పోవడాన్ని గుర్తించారు. పోస్టులపై వివరాలను అసిస్టెంట్ డైరెక్టర్ (పరిపాలన విభాగం) నాగేశ్వరావు నుంచి సేకరించారు. పోస్టుల నియామకం, కన్వెర్షన్ కోసం వైద్యారోగ్య శాఖ సంచాలకులు (డిఎంఇ) కు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. సమీఓలో సివిల్ సర్జన్ ఆర్ఎంఒ డాక్టర్ సతీష్ కుమార్, క్యాన్సర్ విభాగం వైద్యులు డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ జాహ్నవి, నాట్కో సమన్వయకర్త అశోక్ కుమార్, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

చెట్టినాడ్ మైన్స్‌లో బాధితుల ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకు అంగీకరిస్తూ పత్రాలపై సంతకాలు చేయాలన్నారు. అయితే ఆ పత్రాల్లో ఏముందు సరిగా చూడనివ్వకపోవడంతోపాటు ఫొటోలూ తీసుకోనివ్వలేదు. కంపెనీ ప్రతిపాదనలను గ్రామస్తులు తిరస్కరించారు. నిపుణులను పిలిపించి పరిష్కారం కనుగొనాలని, ఇళ్ల బీటలు వారకుండా వారి సూచనలతో కొత్తగా ఇళ్లను నిర్మించాలని, లేకుంటే మరో ప్రదేశంలో కొత్తగా ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేశారు. ఇదే అంశాలపై కంపెనీ మైన్స్ ప్రాంతంలో మంగళవారం ఉదయం 11 గంటలకు సిపిఎం ఆధ్వర్యంలో 150 మందికి పైగా గ్రామస్తులు ధర్నా చేపట్టారు. గంట తర్వాత యాజమాన్య ప్రతినిధులు చర్చలకు ఆహ్వానించారు. అయితే అవి ఫలించకపోవడంతో ఆందోళన కొనసాగింది. గ్రామస్తులు అక్కడే భోజనాలు వండుకున్నారు. తమ సమస్యకు సరైన పరిష్కారం చూపేవరకూ ఉద్యమిస్తామని ఖరాఖండీగా చెప్పారు. దీంతో సాయంత్రం 6 గంటలకు మరోసారి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ ఇల్లకు బీటలు రావడానికి పేలుళ్ల కారణం కాదని, దీనిపై తాము నిపుణులతోనూ పరిశీలన చేయించగా వారూ ఇదే నివేదించారని అన్నారు. దీనికి గ్రామస్తులు స్పందిస్తూ పేలుళ్ల సందర్భంలో కంపెనీ వారు వచ్చి తమ ఇళ్లల్లో కూర్చోవాలని, అప్పుడు తమ ఇళ్లల్లోని సామాన్లు కింద పడుతున్నాయో లేదో, కంపనలు వస్తున్నాయో లేదో చూసుకోవాలని అన్నారు. నిపుణుల కమిటీ ఏమి నివేదించిందో తమకు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ కంపెనీ జనరల్ మేనేజర్‌తో తాము మాట్లాడతామని, 15 రోజుల సమయం కావాలని రాతపూర్వకంగా అడిగారు. ఇందుకు గ్రామస్తులు అంగీకరించారు. 15 రోజుల తర్వాత సరైన న్యాయం చేయకుంటే ఆందోళలనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, నాయకులు ఆంజనేయరాజు, కె.సాయి, జె.వెంకటేశ్వర్లు, కె.సాంబయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం

వీడియో కాన్ఫరెన్స్‌లో జవహర్‌రెడ్డి

పల్నాడు జిల్లాలో 73 కేసులు నమోదు - 209 మంది అరెస్టు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి సీ.ఎస్ అన్ని జిల్లాల కలెక్టర్లు, స్పెషల్ ఎన్ ఫోర్స్ మెంట్ బ్యూరో, ఆయా శాఖల జిల్లా అధికారులతో రాష్ట్ర స్థాయి నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్ కమిటీ సభ్యులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో పోలీస్ వ్యవస్థ, స్పెషల్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు, ఇతర శాఖల అధికారులతో కలిసి మాదక ద్రవ్యాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ మాదకద్రవ్యాల నియంత్రణకు తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఇబి ఇఎస్ వి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతు 2020 మేలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఇ)ని ఒక ప్రత్యేకమైన విభాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఎస్.ఈ.బి ఈ.ఎస్ వి.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 2020 మేలో స్పెషల్ ఎన్ ఫోర్సు మెంటు బ్యూరో (ఎస్.ఈ.)ని ఒక ప్రత్యేకమైన విభాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఎస్.ఈ.బి పోలీసులతో కలిసి పల్నాడు జిల్లాలో ఇప్పటివరకు 73 కేసులు నమోదు చేసి, 209 మంది ముద్దాయిలను అరెస్టు చేశామన్నారు. వారి నుండి మొత్తం 693 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. గంజాయి మొక్కలను పెంచుతున్న వారిపై 3 కేసులు నమోదు చేసి 36 గంజాయి మొక్కలను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. పట్టుబడిన ముద్దాయిలలో మొత్తం 31 మంది ముద్దాయిలు ఒరిస్సా, తెలంగాణ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారన్నారు. ముద్దాయిలలో 5 గురు జైలు శిక్ష అనుభవిస్తున్నారన్నారు. నాటు సారా మరియు అక్రమ మద్యం కేసులలో 17 మంది ముద్దాయిలపై పిడి యాక్ట్ నమోదు చేసి రాజమండ్రి జైలుకు తరలించామన్నారు. పల్నాడు జిల్లాలోని పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, డిగ్రీ కాలేజీలలో విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్ఫలితాల గురించి తెలియజేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతు నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో డి అడిక్షన్ సెంటర్‌లో చికిత్స అందజేయాలని అధికారులను అదేశించారు. గంజాయి, కొకైన్, పొగాకు, ఆల్కహాల్ వంటి మత్తు పదార్థాల అలవాటు నిర్మూలించడం, ఇంటర్నెట్, గేమింగ్ అడిక్షన్ , మొబైల్ ఫోనుని ఎక్కువ వాడటం, ఆన్ లైన్ బెట్టింగ్ మరియు ఇతర చెడు వ్యసనాలు మానిపించడం వంటి కార్యక్రమాలను జిల్లా అధికారులు కలిసి సమన్వయంతో నిర్వహించాలన్నారు.



సమీక్షలో జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారి, ఎక్సైజ్ ఇఎస్

చోరీపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరు గ్రామంలో పాత సినిమా థియేటర్‌లో చోరి జరిగింది. గ్రామానికి చెందిన గంజనబోయిన వెంకటేశ్వర్లు పాత సినిమా థియేటర్ కొనుగోలు చేసి మరమ్మతులు చేపిస్తున్నారు. వైరింగ్ చేయించేందుకు విలువైన రాగి తీగలను కొనుగోలు చేసి అక్కడే ఓ గదిలో భద్రపరిచారు. గుర్తు తెలియని దుండగులు తలుపు తాళాలను ధ్వంసం చేసి గదిలోని రాగి తీగలతో పాటు మరికొంత సామాగ్రిని చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు.



స్వాదీనం చేసుకున్న బైక్‌లతో డిఎస్పీ జనార్ధనరావు, సిబ్బంది, ముందు వరుసలో ముసుగులో నిందితులు

చోరీ కేసుల్లో ఇద్దరు అరెస్టు

ఐదు బైకులు స్వాధీనం

ప్రజాశక్తి-తెనాలి:

బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇరువురు నిందితులను పట్టణ టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో మంగళవారం డిఎస్పీ బి.జనార్ధనరావు వివరాలను వెల్లడించారు. బాల్యం నుంచి చెడు వ్యసనాలకు, జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు ప్పాడుతున్న ఇరువురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి ఐదు బైక్‌లు స్వాదీనం చేసుకున్నట్లు చెప్పారు. పొన్నూరుకు చెందిన కరిముల్లా ప్రస్తుతం నాజరుపేటలో ఉంటున్నాడని, అతనితో పాటు ఐతానగర్‌కు చెందిన శ్యాంసన్‌లను అరెస్ట్ చేశారు. వీరిరువురూ పాత నేరస్తులే. గతంలో జైలు జీవితం గడిపినా వీరిలో మార్పు లేదని. వీరిరువురు ఐదు బైక్‌లను అపహరించారన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు, చెరుకుపల్లి, పొదిలి, విశాఖ పట్నంలో దొంగిలించిన మూడు బైక్‌లను నాజరుపేటలోని నిందితుని నివాసం వద్ద స్వాధీనం చేసుకుని, ఇరవురిని అరెస్ట్ చేశామన్నారు. సమావేశంలో సిఐ ఎస్.వెంకట్రావ్, ఎస్ఐ రమేష్‌బాబు, నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డివి సెల్ సిబ్బంది

మహిళా ప్రాంగణంలో అల్లూరి జయంతి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక మహిళా ప్రాంగణంలో గృహ హింస రక్షణ చట్టం (డివి సెల్) కార్యాలయంలో మంగళావారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో లీగల్ కౌన్సిలర్ కె.పద్మ, పి.రవీంద్రరెడ్డి, హోంగార్డ్స్ కె.దశరథ్ నాయక్, ఎ.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో టాస్క్ ఫోర్స్ టీమ్‌లు

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని 11 గ్రామపంచాయతీల్లో టాస్క్ ఫోర్స్ టీం ఏర్పాటు చేశామని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి తెలిపారు మంగళవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నకిలీ మందులు, ఎరువులు, విత్తనాలను అరికట్టేందుకు ఈ టాస్క్ ఫోర్స్ టీములు పనిచేస్తాయన్నారు. గ్రామాల్లో ఉన్న ఎరువులు విత్తనాల దుకాణాలను తనిఖీ చేస్తారని చెప్పారు టాస్క్ ఫోర్స్ టీమ్లో విఎఏ, వీహెచ్ఎ, ఎంపీ ఈవో, విఆర్ఓ, మహిళ పోలీసు ఉంటారన్నారు మండల స్థాయిలో తాసిల్దారు ఎస్సై ఏవో ఉంటారన్నారు.

జిజిహెచ్ రక్తనిధి కేంద్రానికి ప్రాధాన్యం

ప్రజాశక్తి-గుంటూరు :



సబ్బులు అందచేస్తున్న డాక్టర్ సురేష్

జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ మంగళవారం రక్తనిధి కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రం ఎంతోమంది పేద రోగుల్ని కాపాడేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. ఈ విభాగానికి అవసరమైన సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటున్నా మన్నారు. రక్తదానం చేసే వ్యక్తులు, సంస్థలు మొదటి ప్రాధాన్యత జిజిహెచ్‌కు ఇవ్వాలని ఆయన కోరారు. ఆసుపత్రి అభివృద్ధికి చేయూత ఇవ్వాలని కిరణ్‌కుమార్ పిలుపు మేరకు రక్తనిధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ 200 సబ్బులను అందచేశారు. హీల్ ఫోర్స్ ఇండియా లిమిటెడ్ వ్యవస్థాపకులు వల్లూరి శివప్రసాద్ రూ.50వేల విలువైన పరికరాలు అందచేశారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 47,933
మిర్చి ఎగుమతి	: 45,141
మిర్చి నిల్వ	: 20,916

మిర్చి ధరలు

రూపాయలలో

334	9,500 - 23,500
నెం.5	14,200 - 20,000
273	14,000 - 21,500
341	9,500 - 24,000
సూపర్ 10	12,000 - 23,800
నాన్ ఎసి	
తేజ	9,500 - 25,000
బడిగి	14,000 - 25,500
దేవనూరు డీలక్స్	12,500 - 20,000
తాలుకాయలు	5,000 - 14,000
ఎసి	
334	17,000 - 23,000
నెం.5	18,000 - 22,000
273	19,000 - 19,000
341	12,000 - 23,000
తేజ	10,500 - 24,700
బడిగి	16,000 - 26,000
తాలుకాయలు	10,500 - 26,000

ఈ సెట్‌లో జివిఆర్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

డిప్లొమా మూడు సంవత్సరాల విద్య అభ్యసించి, ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశానికి గత నెల 20వ తేదీన నిర్వహించిన ఈసెట్ ఫలితాల్లో జివిఆర్ కోచింగ్ సెంటర్ విద్యార్థిని కె.మనీష రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్లు డైరెక్టర్ తురకా వీరయ్య తెలిపారు. అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ బ్రాంచి నుంచి మనీషా మొదటి ర్యాంకు సాధించిందన్నారు. మంగళవారం ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. వివిధ బ్రాంచిల నుంచి జయలక్ష్మి 164, కె.సీతారామ్ 303, పి.మానస 203, టి.అఖిల్ 259, షేక్.నఫియా 320, హరిచరణ్ ప్రసాద్ 310, జె.వినాయక 321, తదితరులు పలు ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు. ర్యాంకర్లను అభినందించిన వారిలో ఉపాధ్యాయులు బి.ప్రసాద్, శ్రీనివాసులు, ప్రసాద్ తదితరులున్నారు.





విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్, ఉపాధ్యాయులు


యాత్రకు ఘన స్వాగతం





ఆద్యంతం ఆకట్టుకున్న నేతల ప్రసంగాలు

చివరి వరకు శ్రద్ధగా ఆలకించిన ప్రజలు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి, విజయవాడ

విజయవాడ నగరంలోని ధర్నా చౌక్‌లో మంగళవారం పోలవరం నిర్వాసితుల పోరు కేక మహాపాదయాత్ర ముగింపు సందర్భంగా భారీ బహిరంగ సభ జరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన సభ 3 మూడు గంటల వరకూ సాగింది. ఈ సభలో తొలుత అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి మాజీ మంత్రి, మాజీ ఎంపి వడ్డే శోభనాద్రీశ్వరరావు, దొడ్డి కొమరయ్య చిత్రపటానికి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సభలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణలకు గిరిజన సాంప్రదాయ తలపాగాలను మైదాన ప్రాంత గిరిజన సంఘం నేతలు శ్రీరామ్ శ్రీనివాసరావు, బి.గోపిరాజు, వి.కోటానాయక్, గిరిజన ఉద్యోగ సంఘాల రాష్ట్ర కన్వీనర్ జె.బాలాజీ నాయక్ అలంకరించారు. సభలో సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఇతర వామపక్ష పార్టీల నాయకులు, ప్రత్యేక హోదా సాధన సమితి జెఎసి చైర్మన్ చలసాని శ్రీనివాస్, అమరావతి జెఎసి నాయకులు ఎ.సుధాకర్ తదితరులు పాల్గొని పోలవరం నిర్వాసితుల సమస్యలపై చేసిన ప్రసంగాలు విశేషంగా ఆలోచింప చేశాయి. ఈ ప్రసంగాలు తరలి వచ్చిన సిపిఎం శ్రేణులు, గిరిజనులు, ప్రజల్లో ఉత్సాహాన్ని నింపాయి.





భారీగా తరలి వచ్చిన సిపిఎం, ప్రజా సంఘాల శ్రేణులు, గిరిజనులు

ఎన్‌టిఆర్, కృష్ణా, ఏలూరు, అల్లూరి సీతారామరాజు, గుంటూరు జిల్లాల నుంచి వేలాదిగా సిపిఎం, ప్రజా, కార్మిక, ఉద్యోగ, యువజన, విద్యార్థి, మహిళా సంఘాల శ్రేణులు, గిరిజనులు తరలివచ్చారు. ద్విచక్రవాహనాలు, మినీ వ్యాన్‌లు, లారీలు, ఆటోల్లో తరలి వచ్చిన వేలాది ప్రజలతో ధర్నా చౌక్ రోడ్డు కిక్కిరిసిపోయింది. 15 రోజులపాటు ఎండనక, వాననక, రేయనక పగలనక 400 కిలోమీటర్ల సాగిన మహా పాదయాత్రకు ఆయా ప్రాంత ప్రజల నుంచి విశేష ఆదరణ లభించిందని, నిర్వాసితుల సమస్యల పట్ల సానుకూలత వ్యక్తమైందని నేతల ప్రసంగాల్లో స్పష్టమైంది. మూడు లక్షల మంది గిరిజన ఆదివాసీ నిర్వాసితుల న్యాయమైన సమస్యపై సాగిన ఈ మహాపాదయాత్ర మైదాన ప్రాంత ప్రజల్లోనూ సానుకూలత వ్యక్తమైందనేందుకు బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన జనమే సాక్ష్యంగా నిలిచారు. పాదయాత్ర సాగిన దారిపొడవునా దాతలు వివిధ రూపాల్లో సహాయ సహకారాలు అందించిన తీరును సభలో నేతలు ప్రస్తావించారు. భోజన సదుపాయాలు, మంచినీరు, వసతి, రవాణా, దుస్తులు, చెప్పులు తదితరాలను దాతలు పెద్దఎత్తున అందించి ఈ పాదయాత్రకు మద్దతుగా నిలిచారు. వేదికపై ఉన్న బివి.రాఘవులు, వి.శ్రీనివాసరావు తదితర నేతలకు సిఐటియు, ఎపి ఆశ వర్కర్స్ యూనియన్, రజక వృత్తిదారులు, భవన నిర్మాణ కార్మిక సంఘం తదితర సంఘాల నాయకులు పోరుకేక యాత్రకు ఆర్థిక తోడ్పాటును అందించారు. సభకు ముందు ఆదివాసీలు, ప్రజానాట్యమండలి కళాకారులు చేసిన నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. పోలవరం నిర్వాసితుల సమస్యలపై ప్రజానాట్యమండలి కళాకారులు గేయాలు ఆలపించారు. సభా ప్రాంగణం మొత్తం ఎర్ర జెండాలతో రెపరెపలాడింది. పోలవరం నిర్వాసితుల సమస్యను సమగ్రంగా పరిశీలించి పరిష్కరించకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరుతప్పదని సభ హెచ్చరించింది.



హోరెత్తిన పోరుకేక

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి, విజయవాడ

'పోలవరం నిర్వాసితుల పోరుకేక' రాష్ట్ర రాజధాని ప్రాంతం విజయవాడలో హోరెత్తింది. నగరంలో ఎర్ర సైన్యం కథం తొక్కింది. ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలు, ఎర్ర జెండాలు, మెడలో ఎరుపు, ఆకుపచ్చ కండువాలతో మంగళవారం వందలాది మందితో సాగిన ప్రదర్శన ఆకట్టుకుంది. తలపై కొమ్ములు, చేతిలో డోలు వాయిద్యాలు, ఆదివాసీల తలపాగాలతో గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా చేసిన నృత్యాలతో ముందుకు సాగింది. సోమవారం సాయంత్రం విజయవాడ సింగ్‌నగర్ డాబాకొట్ల సెంటర్‌కు చేరుకున్న పోలవరం నిర్వాసితుల పోరుకేక మహాపాదయాత్ర...15వ రోజు మంగళవారం విజయవాడ ధర్నా చౌక్‌లో ముగిసింది. తొలుత పాదయాత్ర బృందంలోని 351 మందికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, కె.శ్రీదేవి, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు కండువాలను కప్పి పాదయాత్రను ప్రారంభించారు. ఈ యాత్రకు విజయవాడ నగరంతోపాటు ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లా నుండి సిపిఎం శ్రేణులు, శ్రేయోభిలాషులు, సిఐటియు, అనుబంధ సంఘాల శ్రేణులు పెద్దఎత్తున డాబాకొట్ల సెంటర్‌కు చేరుకుని స్వాగతం పలికాయి. మెడలో ఎర్ర, పచ్చ కండువాలు ధరించి, చేతిలో పార్టీ జెండాలు చేబూని ఎంతో క్రమశిక్షణాయుతంగా సాగిన ఈమహాపాదయాత్ర అగ్రభాగాన యాత్ర రదసారధి వి.శ్రీనివాసరావు, వి.వెంకటేశ్వర్లు, మంతెన సీతారామ్, సిహెచ్.బాబూరావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, కె శ్రీదేవి తదితర నేతలు ఉన్నారు. నేతలను వందలాది మంది బృందం సభ్యులు, పార్టీ శ్రేణులు అనుసరించారు. పోలవరం వల్ల సర్వం కోల్పోతున్న గిరిజనుల బాధలు, పాలకుల విధానాలు తెలిపే పాటలతోపాటు ప్రజానాట్యమండలి కళాకారులు యాత్రకు ఊపునిచ్చేలా డిజె సౌండ్‌లో వివిధ రకాల పాటలను పాడుతూ ముందుకు సాగారు. ఎర్ర జెండా రెపరెపలతో యాత్ర సాగింది. ఈ యాత్ర డాబాకొట్లు సెంటరు, సింగ్‌నగర్ ఫ్లైఓవర్, బుడమేరు వంతెన, ముత్యాలంపాడు గవర్నమెంట్ ప్రెస్, సత్యనారాయణపురం భగత్‌సింగ్ రోడ్డు, ఫుడ్ జంక్షన్ (బిఆర్‌టిఎస్ రోడ్), ఘంటసాల సంగీత కళాశాల, దుర్గాపురం, సాంబమూర్తి రోడ్, డిమార్ట్ మీదుగా సభాస్థలి అయిన అలంకార్ సెంటరులోని ధర్నా చౌక్‌కు చేరింది. బుడమేరు వంతెన వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పాదయాత్ర రధసారధి వి.శ్రీనివాసరావు, ఎపి విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ తదితర నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఫుడ్ జంక్షన్ సెంటర్లో రేలా రేలా అంటూ ఆదివాసీ గిరిజన మహిళలతో కలిసి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు తలపై కొమ్ములు ధరించి చేసిన నృత్యాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. నగరంలో మొత్తం 4.5 కిలో మీటర్లు సాగిన ఈ యాత్ర ఆద్యంతం ఎంతో ఉత్సాహంగా సాగింది. ఎక్కడా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా దాడి పొడవునా రోప్‌వే ద్వారా పాదయాత్ర సాగినంత దూరం పార్టీ నాయకులు, కార్యకర్తల జాగ్రత్తలు తీసుకున్నారు. ఇటీవల కాలంలో ఇటువంటి మహాపాదయాత్ర చూడలేదని నగర వాసులు వ్యాఖ్యానించడం కనిపించింది. గవర్నమెంట్ ప్రెస్ వద్ద సిపిఎం నాయకులు మోతీ, కృష్ణమూర్తి, కృష్ణయ్య, నాగరాజు, ఎంబి.నాధన్ యాత్ర బృందంలోని నేతలకు పూలమాలలు వేశారు. పాద యాత్ర బృందంపై పూలవర్షం కురిపించి స్వాగతం పలికారు. సత్యనారాయణపురం మారుతీ గ్యాస్ కంపెనీ సెంటర్లో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సోమేశ్వరరావు, సెంట్రల్ సిటీ నాయకులు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర బృందంపై పూలవర్షం కురిపించారు. ఫుడ్ జంక్షన్ సెంటర్‌లో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు హనుమంతరావు తదితరులు పూలుజల్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అల్లూరి సీతారామరాజు వంతెన వద్ద దుర్గాపురం ప్రాంతానికి చెందిన ఆర్.కోటేశ్వరరావు, ఎం.శివ, సాంబశివరావు తదితరులు పూలు చల్లారు.

విజయవాడలో కదం తొక్కిన ఎర్రసైన్యం

పోలవరం నిర్వాసితుల మహా పాదయాత్రకు ఘన స్వాగతం

అడుగడుగునా పూలవర్షం

మహా పాదయాత్ర సైడ్‌లైన్స్

- పోలవరం నిర్వాసితుల మహాపాదయాత్రతో ఎరుపెక్కిన విజయవాడ వీధులు
- అడుగులో అడుగు వేస్తూ సాగిన పోరుకేక పాదయాత్ర
- ఆకట్టుకున్న గిరిజనుల కోయ నృత్యాలు
- గిరిజనులతో కలిసి నృత్యం చేసిన బివి.రాఘవులు, వి శ్రీనివాసరావు, కెఎస్ లక్ష్మణరావు, బి.వెంకటేశ్వర్లు
- పాదయాత్ర బృందానికి సిపిఎం శ్రేణులు, సిఐటియు, ఇతర సంఘాలు అడుగడుగునా ఘన స్వాగతాలు, పలు ప్రాంతాల్లో పూల వర్షం
- డాబాకొట్లు సెంటరు నుండి సభాస్థలికి చేరుకునేందుకు మూడున్నర గంటల సమయం పట్టింది
- నాలుగు గంటల పాటు సాగిన నేతల ప్రసంగాలు
- పలు జిల్లాల నుంచి తరలి వచ్చిన గిరిజనులు, సిపిఎంశ్రేణులు
- వచ్చిన జనంతో కిక్కిరిసిన ధర్నా చౌక్
- క్రమశిక్షణాయుతంగా సాగిన పాదయాత్ర
- పోలవరం నిర్వాసితుల పట్ల ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టిన ఆయా పార్టీల నేతలు
- పాదయాత్రలో 12 సంవత్సరాల బాలికల నుంచి 70 ఏళ్ల వృద్ధుల వరకు పాల్గొన్నారు.
- 15 రోజుల పాటు 400 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగింది.




ఇది ఆరంభమే

పోలవరం పోరు కేక మహా పాదయాత్ర బహిరంగ సభలో నేతలు

ప్రజాశక్తి-విజయవాడ ప్రతినిధి

పోలవరం పోరుకేక పాదయాత్ర ఆరంభం మాత్రమేనని పలువురు నేతలు అన్నారు. నిర్వాసితులకు న్యాయం చేకూరేంత వరకు పోరాటం ఆగదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. 15 రోజుల్లో స్పందించకపోతే మరో పోరాటానికి కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎం చేపట్టిన పోలవరం పోరుకేక మహాపాదయాత్ర ముగింపు సభ మంగళవారం విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగింది. సభ ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. నేతలు, కార్యకర్తలు, నిర్వాసితులు చివరి వరకూ ఉండి సభను విజయవంత చేశారు. దీనికితోడు వాతావరణం కూడా సహకరించింది. తొలుత కాస్త తుంపర్లు పడినా తర్వాత తెరపిచ్చింది. మరోవైపు పోలవరం, రంపచోడవరం తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది నిర్వాసితులు తరలి వచ్చారు. జూన్ 20వ తేదీన నెల్లిపాకలో ప్రారంభమైన మహా పాదయాత్ర జూలై 4 విజయవాడలో ముగిసింది. సుదీర్ఘంగా 400 కిలో మీటర్ల పాటు చేపట్టిన యాత్రలో సగటున రోజుకు 500 మంది వరకు పాల్గొన్నారు. వీరిలో అధికులు యువకులే ఉన్నారు. 70 ఏళ్ల వృద్ధులు, 120 మంది వరకు మహిళలు సైతం పాల్గొనడం గమనార్హం. మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు జన్మదినం, దొడ్డి కొమరయ్య వీర తెలంగాణ కోసం అమరుడైన దినం జూన్ 4న పోరు కేక ముగింపు సభ నిర్వహించడం విశేషం. పాదయాత్ర విశేషాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు వివరించారు. పాదయాత్రకు వివిధ ప్రజా సంఘాలు సంఘీభావం తెలుపుతూ విరాళాలు కూడా అందించాయి. సిఐటియు రాష్ట్ర కమిటీ రూ.5 లక్షల చెక్కును బివి రాఘవులు, వి శ్రీనివాసరావులకు అందించారు. అలాగే ఏపి ఆశా వర్కర్ల యూనియన్ నేతలు రూ.25 వేలు, సివిల్ సప్లైస్ హమాలీ యూనియన్ నేతలు రూ.20 వేలు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నేతలు రూ.10వేలు, రజక వృత్తిదారుల సంఘం నేతలు రూ.3వేలు పాదయాత్రకు సంఘీభావం తెలుపుతూ విరాళాలు అందించారు. సభ ఆరంభానికి ముందు కళాకారుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాదయాత్రలో కళాకారుల బృందాలు కీలక పాత్ర పోషించాయి. నిర్వాసితుల గ్రామాలకు సంబంధించి దాదాపు 30 మందితో కలిపి ఏర్పాటు చేసిన బృందం కేవలం మూడు రోజుల్లోనే నృత్యాలు నేర్చుకుని ప్రదర్శించడం విశేషం. వీరికి తర్ఫీదు ఇవ్వడంలో ఎపి ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మంగరాజు, అనిల్ కృషి చేశారు. పాదయాత్ర ఆద్యంతం ఈ కళా బృందాలు పాటలు, నృత్యాలతో వందలాది ప్రదర్శనలు ప్రదర్శించి ఉత్సాహం నింపాయి. ప్రత్యేకంగా జంగారెడ్డి గూడెం ప్రదర్శన ఆకట్టుకుంది. పాదయాత్రలో పాల్గొన్న పది బృందాల దళ నాయకులు బొప్పన కిరణ్, ఎం.నాగమణి, పల్లం వెంకట్, పల్లం రామకృష్ణ, లక్ష్మి, సీతారామయ్య, లోతా రాంబాబు, వాణిశ్రీలను అభినందిస్తూ రాష్ట్ర నాయకులు మెమెంటోలు అందజేశారు. సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి రవి వందన సమర్పణ చేశారు.


సభకు హాజరైన ప్రజలు


యాత్రకు ఎస్ఎఫ్ఐ స్వాగతం


సభా వేదికపై కళాకారుల ఆటపాట











మెమెంటోలు అందజేత











వినతిపత్రం ఇస్తున్న రైతులు, నాయకులు

హెచ్‌పిసిఎల్ ఐదేళ్లుగా నిర్లక్ష్యం

పరిహారం, పొలాల చదును కోసం రైతుల వినతి

ప్రజాశక్తి - క్రోసూరు

హెచ్‌పిసిఎల్ కంపెనీ పైప్‌లైన్ వేయడం వల్ల నష్టపోయిన తమకు నష్టపరిహారం ఇవ్వాలని రైతులు రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు మంగళవారం విన్నవించారు. ఈ సందర్భంగా కౌలురైతు సంఘం మండల కార్యదర్శి టి.హనుమంతరావు మాట్లాడుతూ 2018-19లో అనంతవరంలో రైతుల పొలాల్లో నుండి పైపులైను వేశారని, ఇప్పటికి ఐదేళ్లవుతున్నా కొంతమంది రైతుల పొలాలు చదును చేయకుండా వదిలేశారని, పైప్‌లైన్ వేసేటప్పుడు వచ్చిన రాళ్లు తొలగించలేదని చెప్పారు. దీంతో నాలుగేళ్లగా పంటలు వేయడానికి వీలవక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రెండేళ్లగా ఈ సమస్యపై విన్నవిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధుల్లో స్పందన కొరవడిందని విమర్శించారు. కార్యక్రమంలో రైతులు ఎన్.వెంకటరావు, టి.ఏడుకొండలు, ఎన్.నాగరాజు, ఎన్.ఏడుకొండలు, ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న రూపేష్ గుప్తా

పుట్టిన రోజున విద్యార్థులకు పుస్తకాలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

వ్యవస్థలో మార్పు విద్య ద్వారానే సాధ్యమవుతుందని శారదాంబ జ్యువెలర్స్ డైరెక్టర్ నాగసరపు రూపేష్ గుప్తా అన్నారు. మంగళవారం రూపేష్ గుప్తా పుట్టినరోజు సందర్భంగా స్థానిక లింగంగుంట్ల పిడబ్ల్యూడి కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.20 వేలతో పుస్తకాలు, పెన్నులు, పలకలను పంపిణీ చేశారు. అనంతరం భోజనం పెట్టారు. రూపేష్ గుప్తా మాట్లాడుతూ భావి పౌరుల జీవితం విద్యపై ఆధారపడి ఉంటుందన్నారు. చిన్నతనంలోనే లక్ష్యం నిర్దేశించుకొని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రూపేష్ గుప్తా సోదరుడు రాందేవ్ గుప్తా, హెచ్‌ఎం సిహెచ్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రాఘవశర్మ, అనురాధ, కోటేశ్వరమ్మ, భాషు, ఎలిజబెత్ రాణి పాల్గొన్నారు.

ఇకెవైసి చేయించుకోకుంటే పెన్షన్ రాదు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నరసరావుపేట ట్రెజరీ పరిధిలోని సర్వీస్, ఫ్యామిలీ పెన్షర్లు 3238 మంది ఉండగా ఇంకా 428 మంది ఇకెవైసి చేయించుకోవాల్సి ఉందని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు మానం సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన జారీ చేశారు. ఇకెవైసి చేయించుకోవాల్సి వారు నరసరావుపేటలోని సంఘం కార్యాలయంలో సంప్రదించాలని, ఈ నెల 15 లోగా చేయించుకోని వారికి పెన్షన్ నిలిచిపోతుందని అసిస్టెంట్ ట్రెజరీ అధికారి మౌలాలి తెలిపారని పేర్కొన్నారు.

ఆధారాల ప్రకారమే పరిహారం

- కొండమోడు-పేరేచర్ల రహదారి విస్తరణ బాధితులతో జెసి సమావేశం
- భూసేకరణ చట్ట ప్రకారం 4 రెట్లు పరిహారం చెల్లించాలన్న రైతు సంఘం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్



రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

కొండమోడు-పేరేచర్ల రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న వారికి అసైన్డ్ భూములకూ పట్టా భూములు మాదిరి పరిహారం చెల్లిస్తామని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. విస్తరణకు భూ సేకరణపై ఆర్‌డిఒ కార్యాలయంలో రైతులతో మంగళవారం సమావేశమయ్యారు. గుర్తించిన భూములకు సంబంధించి రైతు యాజమాన్యపు హక్కులను పరిశీలించారు. పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డు దస్తావేజుల జిరాక్స్ కాపీలను రైతుల నుండి సేకరించారు. భూములు కోల్పోతున్న ధూళిపాళ్ల, కంకణాలపల్లి, సత్తెనపల్లి రైతులతో జెసి మాట్లాడుతూ నోటిఫికేషన్ జారీచేసిన తేదీ నాటికి గత మూడేల్ల రిజిస్ట్రేషన్ విలువను పరిగణనలోకి తీసుకుంటామని, దానికి రెండున్నర రెట్లు పరిహారం చెల్లిస్తామని చెప్పారు. బహిరంగ మార్కెట్లో ఎకరం రూ.60 లక్షల నుండి రూ.కోటి వరకు ఉందని, దాని ప్రకారం పరిహారం చెల్లించాలని జెసికి రైతులు విన్నవించారు. అయితే ఆధారాల మేరకే పరిహారం చెల్లిస్తామని జెసి స్పష్టం చేశారు. జూన్‌లో భూములు రిజిస్ట్రేషన్ వ్యాల్యూషన్ ప్రభుత్వం పెంచిందని, ఆ మేరకు పరిహారం చెల్లించాలని రైతులు కోరడంతోపాటు వారి అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా ఇచ్చారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గద్దె చలమయ్య మాట్లాడుతూ భూసేకరణ చట్టం ప్రకారం 4 రెట్లు పరిహారం చెల్లించాలన్నారు. భూములు స్వాధీనం చేసుకున్న రోజున ఉన్న రిజిస్ట్రేషన్ వ్యాల్యూషన్ ప్రకారం రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆర్‌డిఒ బిఎల్‌ఎన్ రాజకుమారి, తహశీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

కందిపప్పు ఇవ్వడం లేదన్న కార్డుదరులు

ఇంటింటికి రేషన్ బియ్యం వాహనాన్ని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న వాహనాన్ని పరిశీలించి కార్డుదారులతో మాట్లాడారు. కందిపప్పు ఇవ్వటం లేదని కార్డుదారులు చెప్పడంతో ఆపరేటర్‌ను జెసి వివరణ అడిగారు. తక్కువ వస్తుండడంతో కొంతమందికే పంపిణీ చేస్తున్నామని ఆపరేటర్ చెప్పారు. జెసి వెంట ఆర్‌డిఒ బిఎల్‌ఎన్ రాజకుమారి, తహశీల్దార్ సురేష్, పౌరసరఫరాల పర్యవేక్షణ అధికారి అరుణాదేవి ఉన్నారు.

కోర్టు ప్రాంగణంలో న్యాయవాదుల డిమాండ్స్‌డే

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

సత్తెనపల్లిలో అన్ని కోర్టులు కలిపి ఒకేచోట నూతన కోర్టు కాంప్లెక్స్ నిర్మించాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు మారూరి లింగారెడ్డి డిమాండ్ చేశారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఎపి రాష్ట్ర సమితి పిలుపు మేరకు స్థానిక తాలూకా కోర్టు న్యాయ దేవత విగ్రహం వద్ద మంగళవాకరం డిమాండ్స్ డే పాటించారు. న్యాయవాదుల రక్షణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టాలని, న్యాయవాదుల డెత్ బెనిఫిట్స్ రూ.8 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న డెత్ బెనిఫిట్స్ రూ.30 కోట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య బీమా మొత్తాన్ని పెంచాలన్నారు. ఈ మేరకు తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఐఎఎల్ ఎపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎన్.వేణుగోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు కె.వీరభాస్కర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు సిహెచ్.విజయభాస్కర్‌రెడ్డి, కె.హనుమయ్య, పి.వెంకటకోటయ్య, కె.వెంకటేశ్వరరావు, జె.విజయ్‌కుమార్, బి.సంగీతరావు, డి.శ్రీనివాస్, బి.శ్రీనివాసబాబు, యు.పాపారావు, ఎస్.వీరయ్య, సిహెచ్.బాలకోటయ్య, పి.రవికుమార్, జి.వెంకటశివ, సిహెచ్.బాబూరావు, విద్యాసాగర్‌రెడ్డి, షేక్ నాగూర్‌బాబు, సిహెచ్.భరద్వాజరెడ్డి, ఎ.నాగార్జున పాల్గొన్నారు.



ఎర్రమట్టి అక్రమ తవ్వకాలు చూసినా..

ప్రజాశక్తి - నకరికల్లు

అడ్డూ అదుపు లేకుండా ఎర్ర మట్టిని అక్రమార్కులు యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. వీరి చర్యలు కొండలు, గుట్టలు మాయమవుతున్నాయి. ఎర్ర మట్టికి డిమాండ్ ఎక్కువగా ఉండడంతో నకరికల్లు మండలంలోని త్రిపురాపురం క్వారీలో అనుమతులు లేకుండానే రాత్రింబవళ్లు మట్టిని తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. మైనింగ్, రెవెన్యూ, పోలీస్, అధికారులకు ఎవరైనా సమాచారం అందజేస్తే తూతూ మంత్రంగా తనిఖీలతో సరిపెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. గతంలో టిప్పర్ మట్టి ధర రూ.6 వేలకు, ట్రాక్టర్ మట్టిని రూ.వెయ్యికి అమ్ముకుంటున్నారు. కొంతమంది గ్రూపుగా ఏర్పడి చేస్తున్న ఈ దందాలో అధికార పార్టీకి చెందిన వారున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నాలుగు రోజుల నుండి మట్టి తవ్వకాలు జరుగుతున్న విషయం తెలిసి ఇన్‌ఛార్జి ఆర్‌ఐ రాజారెడ్డి, త్రిపురాపురం వీఆర్వో మార్క్ తవ్వకాల ప్రదేశాన్ని మంగళవారం పరిశీలించి తవ్వకాలను ఆపేయించారు. అయితే కేసులేమీ పెట్టించలేదని తెలిసింది. వివరణ కోసం ఇన్‌ఛార్జి ఆర్‌ఐను సంప్రదించగా సమాధానం ఇవ్వలేదు. తహశీల్దార్ సురేష్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు.

అభివృద్ధికి వ్యాపారవేత్తలు సహకరించాలి : కలెక్టర్



పారిశ్రామిక, వ్యాపారవేత్తల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి - పల్నాడుజిల్లా

జిల్లా సమగ్రాభివృద్ధికి వ్యాపారవేత్తల సహకారం అవసరమని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అంశంపై కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం సమీక్షించారు. జిల్లా అభివృద్ధిల భారీ పరిశ్రమల యాజమాన్యం తమ వంతు బాధ్యతగా సహకారం అందించాలని, పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వ సహకారం ఉంటుందని అన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పి.వెంకటేశ్వరరావు, సిపిఒ ముక్తేశ్వరరావు, జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ అధికారి ధనలక్ష్మి, ఇతర అధికారులు, స్పిన్నింగ్ మిల్లులు, సిమెంట్ కంపెనీలు, గ్రానైట్ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు స్థల సేకరణ పూర్తి చేయండి

జిల్లాలోని 5 మండలాల ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రాల పరిధిలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ భవనాల నిర్మాణాలకు స్థల సేకరణ వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నకరికల్లు, నూజెండ్ల, కారంపూడి, మాచవరం, నాదెండ్ల మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలకు అనుసంధానంగా భవన నిర్మాణాలు చేపట్టేలా, స్థల సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇందుకు ఎంపిడిఒ, పిహెచ్‌సి వైద్యులు, ఆర్ అండ్ బి ఎఇలు కమిటీగా ఏర్పడి, సమన్వయ పరచుకోవాలన్నారు. ఒక్కో బ్లాక్ పబ్లిక్ హెల్త్ భవన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి, ఎపిఎంఐడిసి అధికారి శ్రీధర్, జిల్లా రహదారులు భవనాల శాఖ ఇఇ రాజానాయక్ పాల్గొన్నారు.

వానలతో సాగుకు అనువుగా భూములు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ప్రత్తి విత్తనాలు మొలకెత్తిన పొలం



రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. కూరగాయల విత్తనాలు నాటేందుకు ఇది అనువైన సమయమేనని అధికారులు చెబుతున్నారు. మండల పరిధిలో మురికిపూడి, రాజపేట, యడవల్లి, పోతారం తదితర గ్రామాల్లో వంగ, గోరు చిక్కుడు, టమోటా, బెండ, ఆకు కూరలు సాగు చేస్తుంటారు. ప్రతిఏడాది జూన్ 10-20 తేదీల్లో పత్తి విత్తనాలు నాటతారు. అయితే ఈ ఏడాది వర్షాల్లేని కారణంగా కొంత ఆలస్యమైంది. గతేడాది ఇదే సమయానికి మండలంలో 28.4 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదవగా ఈ ఏడాది ఇప్పటి వరకు 12.6 మిల్లీ మీటర్లు నమోదైనట్లు తహశీల్దార్ జి.సుజాత తెలిపారు. తాజా వానలతో పత్తి, కూరగాయాల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు.

జిల్లా వైద్యశాలకు బాయిల్స్ ఆపరేటర్ల బహూకరణ



బాయిల్స్ ఆపరేటర్

ప్రజాశక్తి-తెనాలి

తెనాలి జిల్లా వైద్యశాలకు ఆపరేషన్ థియేటర్‌లో ఉపయోగపడే బాయిల్స్ అపరేటర్లను దాతలు బహూకరించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మంగళవారం వెల్లడంచిన వివరాల ప్రకారం కర్లపాలెంకు చెందిన ఎపి ప్రజారోగ్య వేదిక, పద్మావతి నరశింహమూర్తి మెమో రియల్ ట్రస్టు సంయుక్తంగా రూ.80వేల విలువైన బాయిల్స్ ఆపరేటర్లను బహూకరిం చారు. సహజంగా ఇవి ఆపరేషన్ సమయంలో రోగికి మత్తు మందు ఇచ్చేందుకు ఉపకరిస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా దాతలను ఆమె అభినందించారు. దాతలు విజయలక్ష్మి, కిరణ్‌కుమార్ మాట్లాడుతూ డెల్టా ప్రాంతంలో అతి పెద్ద వైద్యశాలగా పేదలకు నిరంతర సేవలందిస్తున్న నేపద్యంలో సామాజిక సేవా దృక్పదంతో బాయిల్స్ ఆపరేటర్స్‌ను బహూకరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో చిరంజీవి పాల్గొన్నారు.

పినపాడులో డెంగీ అవగాహన సదస్సు



మాట్లాడుతున్న వైద్యాధికారిణి డాక్టర్ లిఖిత

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలోని పినపాడు అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం డెంగీ అవగాహన మాసోత్సవాల సందర్భంగా వైద్య సిబ్బందితో సదస్సు నిర్వహించారు. వైధ్యాధికారిణి డాక్టర్ జి.లిఖిత అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ డెంగీ వ్యాప్తిపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. దానిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి వివరించాలన్నారు. ముఖ్యంగా దోమకాటు ద్వారా డెంగీ విస్తరిస్తుందని, దానిని అరికట్టాలంటే దోమలను అరికట్టాలన్న విషయం ప్రజలకు తెలియజేయాలన్నారు. దోమల నియంత్రణలో ప్రజల్లో చైతన్యం రావాలన్నారు. ఇంటింటికి అవగాహన కరపత్రాలను పంచాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్ డి.శ్రీనివాసరావు, అరోగ్య కేంద్రం సిబ్బంది వై.స్రవంతి, బి.లలిత, బి.సంధ్యారాణి, బి.విజయకుమార్, పి,సుధీర్, షేక్ రషీద్ పాల్గొన్నారు.

మున్నంగి పిహెచ్‌సిలో ...

కొల్లిపర మండలం మున్నంగి ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి డాక్టర్ వి.ప్రియాంక అధ్యక్షతన డెంగ్యూ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రధమ శత్రువు దోమలేనని, వాటిని నియంత్రి ంచటం ద్వారా డెండ్యూతో పాటు అనేక జబ్బుల నియంత్రణ సాధ్యపడుతుందన్నారు. ముఖ్యంగా డెంగ్యూ వ్యాప్తికి కారణాలు, నియంత్రణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యాధి కారిణి డి.స్వరూపరాణి, సిబ్బంది వి.బుజ్జిబాబు, బి.దవనం, ఎస్.ఉషారాణి, ఎ.భాగ్యలక్ష్మి, జి.శ్రీనివాసరావు, వి.లక్ష్మి, వి.కుసుమ, మార్తమ్మ, శ్యామ్, జ్యోతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రూ.50కు రైతుబజార్లో టమోటా

ప్రజాశక్తి - మంగళగిరి :మంగళగిరి రైతు బజారులో కిలో రూ.50లకు టమాటాలు విక్రయించడం జరుగుతుందని ఎస్టేట్ ఆఫీసర్ రమేష్ తెలిపారు. రైతు బజారుకు 5 టన్నుల టమోటా వచ్చినట్లు మంగళవారం ఆయన చెప్పారు. ఒక్కో మనిషికి కేజీ మాత్రమే ఇవ్వడం జరుగుతుందన్నారు. కావున వినియోగ దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



స్వాతంత్ర్య పోరాటంలో చెరగని ముద్ర 'అల్లూరి'

జిల్లాలో ఘన నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి

స్వాతంత్ర సమరయోధులు, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ యు శారదా దేవి, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, అడిషనల్ కమిషనర్ కే హేమమాలిని, సెక్రెటరీ పి శ్రీనివాసరావు, డి ఎ కష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఏపీఎస్పీ క్యాంప్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఎస్ సాయి ప్రసాద్, అసిస్టెంట్ కమాండ్స్ శ్రీనివాస్ బాబ్జి, మల్లికార్జున రావు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టి బ్రిటీష్ పరాయి పాలకులతో పోరాడిన అల్లూరి సీతారామరాజు త్యాగం గొప్పదని, తాడేపల్లి తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి అన్నారు. మంగళవారం అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఎం టి ఎంసీ పరిధిలోని తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో అల్లూరి సీతా రామరాజు జయంతి కార్యక్రమం జరిగింది. అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి తహసీల్దార్ నాగిరెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ నాగిరెడ్డి భారతదేశ స్వాతంత్ర సంగ్రామ ఉద్యమ చరిత్రలో అల్లూరి సీతారామరాజుది ఒక ప్రత్యేక స్థానమని అన్నారు. ఆయన నమ్మిన సిద్ధాంతాలపై ఏమాత్రము రాజీ పడకుండా ఆయన తుది శ్వాస వరకు పోరుబాట సల్పిన మహోన్నతుడని కొనియాడారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రశాంతి, డిప్యూటీ తాసీల్ధార్ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి:

భారత స్వతంత్ర సంగ్రామంలో అల్లూరి సీతారామరాజు చెరగని ముద్ర వేశారని హైదరాబాద్‌కు చెందిన సామితీ సమితి కార్యదర్శి పవన్ అన్నారు. స్థానిక గాంధీ నగర్‌లోని బొల్లిముంత ఫౌండేషన్ కార్యాలయంలో బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్, అభ్యుదయ కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి నిర్వహించారు. తొలుత అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ అల్లూరి తెగువ భరత జాతికే గర్వకారణమన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ సామ్రాజ్య వాదులను గడగడలాడించారని కొనియాడారు. నేటి యువత అల్లూరి తెగువను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. బొల్లిముంత కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇస్కస్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పాశం వెంకటేష్, ఏఐవైఎఫ్ నాయకులు నాగరాజు, రాజేష్, రవితేజ, శేఖర్, అశోక్, వేణు, అశోక్ దుర్గ పాల్గొన్నారు.

అధికారుల తీరుతో రైతులకు నష్టం

ప్రజాశక్తి-తెనాలిరూరల్ :అధికారుల మధ్య సమన్వయ లోపం రైతులకు తీవ్ర నష్టం మిగిల్చిందని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుల ములకా శివసాంబిరెడ్డి అన్నారు. సోమ, మంగళ వారాల్లో కురిసిన భారీ వర్షాలకు ముంపుకు గురైన వరి పొలాలను రైతులతో కలిసి వారు మంగళవారం పరిశీలించారు. ఐతానగర్ శివారు, నేలపాడు, తేలప్రోలు, కంచర్లపాలెం గ్రామాల్లో పొలాలను పరిశీలించారు. పలువురు రైతులు వర్షాలకు నష్టపోయిన తీరు బృందానికి వివరించారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ డ్రెయినేజ్, మున్సిపల్, గృహనిర్మాణ శాఖల మధ్య సమన్వయ లోపం రైతుల కొంప ముంచిందన్నారు. సకాలలో కాలువల్లో గుర్రపు డెక్క, వ్యర్థాలను తొలగించకపోవటం, జగనన్న కాలనీ వద్ద కల్వర్టు నిర్మాణానికి కాలువకు అడ్డుకట్ట వేయటంతో కాలువల ద్వారా నీరు పోయే మార్గం లేక పొలాల్లో మేట వేసిందన్నారు. ఇప్పటికే రైతులు ఎద పద్ధతిలో వరి సాగుకు ఎకరానికి రూ.7వేల పైచిలుకు పెట్టుబడులు పెట్టారన్నారు. రైతులకు ఎకరాకు రూ.10వేలు పరిహారం అందించటంతోపాటు, విత్తనాలు ఉచితంగా అందించా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం. సాంబశివరావు, ఈదల మురళి, హారికా ప్రసాద్, పాలేటి వెంకట్రావ్, రైతులు మేకల చిట్టిబాబు, వేజళ్ళ రోశయ్య, మహబూబ్ ఖాన్ పాల్గొన్నారు.



వరి పొలాలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు



రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బాలికలకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - దుగ్గిరాల : పుట్టిన ఊరిని గుర్తించుకొని ఊరికి సేవలు అందించటం అభినందనీయమని రోటరీ క్లబ్ గుంటూరు ప్రెసిడెంట్ తిలక్ బాబు అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని మంచికలపూడి గ్రామంలో 6 నుండి 10వ తరగతి చదువుతున్న 35 మంది విద్యార్థినులకు సైకిళ్ళు ఒక వికలాంగుడికి ట్రైసైకిల్‌ను అందజేశారు. గ్రామానికి చెందిన కొండపినేని విజయ్ కృష్ణ ప్రస్తుతం గుంటూరులో సిరి ఏ సీడ్స్ సంస్థను నిర్వహిస్తున్నారు. ఆయన తాను జన్మించిన మంచికలపూడి గ్రామంలోని అంగన్వాడి పాఠశాలలకు స్టేషనరీ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ యార్లగడ్డ చంద్ర భవాని, రామయ్య వై స్టాలిన్ ఏమినేనీ కోటేశ్వరావు పాల్గొన్నారు.

రజకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి - మంగళగిరి :పట్టణ రజిక జన సేవా సంఘం నూతన కమిటీ మంగళవారం ఎన్నికయింది. ఈ మేరకు పట్టణ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సేవా సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు ప్రసంగించారు. రాష్ట్ర వ్యాప్తంగా రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం కొరకు ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పట్టణ నూతన కమిటీ అధ్యక్ష,కార్యదర్శులుగా కానుగంటి శ్రీనివాసరావు, ఆర్ శ్రీనివాసరావు, కోశాధి కారిగా నీలం శ్రీకృష్ణ, ఉపాధ్యక్షులుగా ఎం శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా కే పూర్ణ శేఖర్ ఎన్నికయ్యారు. సమావేశంలో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, ప్రభుత్వ ఉద్యోగాల్లో వారి కోటాను వారికే ఇవ్వాలని తీర్మానించారు.

వంగవీటి రంగాకు నివాళి

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్ :వంగవీటి మోహన రంగా పేదల కోసం జీవితం త్యాగం చేశారని మంగళగిరి వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఎంటిఎంసి పరిధిలోని ప్రాతురులో వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామ కృష్ణా రెడ్డి, వంగవీటి రాధాకృష్ణ, ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు పోతిన వెంకట మహేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి -మంగళగిరి: వంగవీటి మోహన రంగా జయంతి సందర్భంగా మంగళవారం టిడిపి కాపుదళం ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట గల రంగా విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి కాపుదల నాయకులు సిహెచ్ శివకుమార్, ఆర్ నరేంద్ర, వి శ్రీనివాసరావు, ఏ రవికాంత్, ఆర్ హనుమంతరావు, గోవాడ దుర్గారావు పాల్గొన్నారు.

వంగవీటి మోహన్ రంగా జయంతి సందర్భంగా మంగళవారం మంగళగిరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ షేక్ సలీం, గోలి సాంబశివరావు, ఆర్ హనుమంతరావు, కే కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాశాల యాజమాన్యం

రోశయ్య అందించిన సేవలు గొప్పవి

ప్రజాశక్తి-తెనాలి: విద్యావ్యవస్థలో సంస్కరణలకు నాంది పలికన మహనీయుడు కొణిజేటి రోశయ్య అని ఎన్ఆర్‌కే అండ్ కెఎస్సార్ గుప్త కళాశాల ప్రిన్సిపల్ గోగినేని విజయకృష్ణ అన్నారు. రోశయ్య జయంతి సందర్భంగా కళాశాల్లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు విద్యాసంస్థల అభివృద్ధికి రోశయ్య ఎంతగానే చేయూతనిచ్చారన్నారు. 1991లో డిగ్రీ కళాశాలను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారని, అలాగే కళాశాలకు పిజిలో ఎంసిఏ, ఎంబిఏ వంటి కోర్సుల వరకూ విస్తరింపచేయటంలో ఆయన చేసిన సహకారం గొప్పదని కొనియా డారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.దశరథరామిరెడ్డి, మేనేజర్ డి.శ్రీనివాసరావు, అధ్యాపకులు కెవి రవికుమార్, టిజి కళావతి, షేక్ రఫి, ఆర్‌వి సునీత, ఎ.బాలగోపాల్, ఎ.నాగరాజు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా జగనన్న సురక్ష

ప్రజాశక్తి-తెనాలి:

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే పరమావధిగా జగనన్న సురక్ష నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. స్థానిక లింగారావు కూడలిలోని సచివాలయంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు, కుల మతాలకు అతీతంగా వైసిపి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు అమలౌతున్నాయన్నారు. అయితే కొన్ని సాంకేతిక కారణాలతో అక్కడడక్కడా అర్హులకు సంక్షేమ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే వారిని గుర్తించి పథకాలను వర్తింపచేసేందుకు ముఖ్యమంత్రి జగన్ ఆదేశాలతో జగనన్న సురక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నశీం, కమిషనర్ ఎం.జస్వంతరావు అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో ఎఐఎస్ఎఫ్ సర్వే

ప్రజాశక్తి - మంగళగిరి :నగర పరిధిలోని వడ్లపూడి సెంటర్, గణపతి నగర్ సంక్షేమ హాస్టళ్లలో ఎఐఎస్ఎఫ్ నాయకులు మంగళవారం సర్వే నిర్వహించారు. విద్యార్థులను కూడా హాస్టల్‌లో సరైన సౌకర్యాలు ఉన్నాయా లేవా అని అడిగి సర్వే నిర్వహించారు. అపరిశుభ్రంగా ఉన్న రూములు, వాటర్ ఫెసిలిటీ, బాత్రూం డోర్స్ అన్ని అసంపూర్తిగా ఆసౌకర్యంగా ఉన్నాయని, వసతులు కల్పించకుండా విద్యార్థులు రోగాల బారిన పడితే బాధ్యులు ఎవరని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి గోపి. కో కన్వీనర్ అభి వార్డెన్‌ను నిలదీశారు. గణపతి నగర్ హాస్టల్లో కూడా తనిఖీలు నిర్వహించగా వాటర్ సదుపాయం సీలింగ్ పెచ్చులు వాటర్ కు తడిసి పెచ్చులూడి పడిపోతున్నాయని కిటికీ తలుపులు కూడా సరిగ్గా లేవన్నారు. రెండు సంక్షేమ హాస్టల్స్ లో సరైన సౌకర్యాలు కూడా లేవని, కనీసం భోజనం కూడా సరిగ్గా ఉండటం లేదని విద్యార్థులు నాయకులకు తెలియజేశారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి -మంగళగిరి :వైసిపి మంగళగిరి పట్టణ జే సి ఎస్ ఇన్చార్జిగా ఎండి ఫిరోజ్, తాడేపల్లి పట్టణ ఇన్చార్జిగా ఈ డేవిడ్ రాజును నియమించారు. వారిని నియమించినందుకు గాను మంగళవారం పట్టణ వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, రాష్ట్ర ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిలకు కృతజ్ఞతలు తెలిపారు.

వివి ప్యాట్ గోడౌన్లు తనిఖీ

ప్రజాశక్తి-గుంటూరు



వివి ప్యాట్‌లు పరిశీలిస్తున్న కలెక్టర్

త్రైమాసిక తనిఖీలలో భాగంగా ఫిరంగిపురం రేపూడి మార్కెట్ యార్డ్ గోడౌన్‌లో భద్రపరచిన వీవీ ప్యాట్ లను మంగళవారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తనిఖీ చేశారు. రాజకీయ పార్టీల ప్రతి నిధుల సమక్షంలో గోడౌన్లకు వేసిన సీళ్ళు తొలగించి తాళాలు తీసి గోడౌన్ లోపల ఉన్న వీవీ ప్యాట్‌లు ఉంచిన బాక్సులను పరిశీలించి తిరిగి గౌడన్లకు తాళాలు వేసి సీళ్ళు వేయించారు. గోడౌన్‌లో, వెలుపల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. వీవీప్యాట్ గౌడన్ల భద్రత విషయంలో రాజీపడకుండా అవసరమైన అన్ని చర్యలు పకడ్బందీగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివ రామిరెడ్డి, ఫిరంగిపురం తహశీల్దార్ పద్మనాభుడు, కలెక్టరేట్ హెచ్ సెక్షన్ పర్యవేక్షకులు సిద్దార్ద్, టీడీపీ ప్రతినిధి మండవ చిన నరసింహులు, సీపీఎం ప్రతినిధి సిహెచ్. వెంకటేశ్వర్లు, వైసిపి ప్రతినిధి కె.చిన్నపరెడ్డి, బిజెపి ప్రతినిధి ఇ.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కళాశాల సెమినార్‌లో రాజ్ సజ్జ

ప్రజాశక్తి-గుంటూరు



రాజ్ సజ్జాను సన్మానిస్తున్న కాలేజి యాజమాన్యం

విద్యార్థులు వినూత్న ఆలోచనలతో పరిశ్రమలు స్థాపించే స్థాయికి చేరే వరకూ నిరంతర ఆవిష్కరణలు చేయాలని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో జరిగిన సాఫ్ట్ స్కిల్స్, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌పై జరిగిన సెమినార్‌లో అమెరికాకు చెందిన జెస్‌పాక్ట్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రాజ్ సజ్జ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక యుగంలో టెక్నాలజీ రంగంలో ఏర్పడిన పోటీని అధిగమించే విధంగా విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలు చేయాలని, అదే విధంగా తమ ఆవిష్కరణలను మార్కెట్‌లో ఆదరణలో ఉన్నత విజయాన్ని సాధించే దిశగా కృషి చేయాలని, అందుకు కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో అవసరమని, అదే విధంగా విద్యార్థులు కాలాన్ని వృధా చేయకుండా ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ ఎప్పటికప్పుడు మారుతున్న టెక్నాలజీని నేర్చుకోవాలని సూచించారు. ఈ సెమినార్‌లో కళాశాల విద్యార్థులు తయారు చేసిన కృత్రిమ అవయవాలను, వాటి పనితీరును, ప్రాముఖ్యతలను వివరించారు. విద్యార్థులను నూతన ఆవిష్కరణలు చేసే దిశగా కాలేజి యాజమాన్యం నిరంతరం ప్రోత్సహిస్తుందని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ పేర్కొన్నారు. కారక్రమంలో కళాశాల ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.వి.పి.చంద్రశేఖర్, డాక్టర్ స్వర్ణశ్రీ, డాక్టర్ సజ్జా రాధిక పాల్గొన్నారు.

కిట్స్‌లో కంప్యూటర్ ఆర్కిటెక్చర్‌పై అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఎక్స్ప్లోరింగ్ బిట్వీన్ కంప్యూటర్ ఆర్కిటెక్చర్ ఇంప్లిమెంటేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి ఎన్ఐటి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.నరేష్‌కుమార్ రెడ్డి హాజరై మాట్లాడుతూ కంప్యూటర్ ఆర్కిటెక్చర్‌లో రీసెర్చ్ ఎలా చేయాలి, కంప్యూటర్ విడిభాగాలను ఎలా ఇంప్లిమెంటేషన్ చేయాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. కంప్యూటర్ ఎలా ఉంటుంది, దానికి స్టాక్ బేస్డ్ సిపియు ఆర్గనైజేషన్, పైప్ లైనింట్ అంటే ఏంటి అనే అంశాలపై చర్చించారు. విద్యార్థుల్లో ఇలాంటి కార్యక్రమాలు నూతన ఆలోచనలకు వాటి ఆవిష్కరణలకు ఎంతగానో ఉపయోగపడతాయని కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ కోయ శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ కె.హరిబాబు, సిఎస్ఇ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.రమేష్ పాల్గొన్నారు.

హిందూ ఫార్మసీలో సీనియర్ వైద్యులకు సన్మానం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కాలేజిలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని సీనియర్ వైద్యులను సన్మానించారు. కళాశాల పాలక మండలి చైర్మన్ జూపూడి రంగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల గౌరవ చైర్మన్ డాక్టర్ ఎం.రాధాకృష్ణమూర్తి, జిజిహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ రమణ యశస్విని సన్మానించారు. కోవిడ్ సమయంలో నిబద్ధతతో పనిచేసి చాలా మంది ప్రాణాలను కాపాడిన వైద్యుల సేవలను రంగరాజు కొనియాడారు. కళాశాల అడిషనల్ సెక్రెటరీ మాజేటి వి.ఎస్.ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ సి.ఎ.నిపుణుల ప్రాముఖ్యత గురించి వివరించారు. డాక్టర్ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ డాక్టర్ బి.సి.రాయ్ ప్రముఖ డాక్టరుగానే కాక, బెంగాల్ ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలను విద్యార్థులు తెలుసుకొని స్ఫూర్తి పొందాలని సూచిం చారు. కార్యక్ర మంలో కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవి కుమార్, ఫార్మా డి.డైరె క్టర్ డాక్టర్ పి. సీతా రామయ్య, హెచ్‌ఒడి హేమ కుమారి పాల్గొన్నారు.



డాక్టర్ రాధాకృష్ణమూర్తిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

అక్టోబర్ 2 నుండి 'ఆడుదాం ఆంధ్రా'

క్రీడా సంబరాలపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

'ఆడుదాం ఆంధ్ర' పేరుతో అక్టోబర్ 2 నుండి 50 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా సంబరాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలక్టరేట్‌లో 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంపై ప్రాథమిక సమావేశం కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జెసి రాజకుమారితో కలిసి సమావేశం నిర్వహిం చారు. కలెక్టర్ మాట్లాడుతూ 17 ఏళ్ల వయస్సు పైబడిన వారు 'ఆడుదాం ఆంధ్ర' క్రీడల్లో పాల్గొనవచ్చున్నారు. ఈ క్రీడలను గ్రామ, వార్డు, మండలం, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాలలో పోటీలుంటాయన్నారు. అంతేగాక సాంప్రదాయ క్రీడలైన 3కె రన్, యోగా, టెన్నికాయిట్ క్రీడలు ఉంటాయన్నారు. గ్రామస్థాయిలో ఆడేవారి నుంచే క్రీడాకారులకు అవసరమైన క్రీడా సామగ్రి అందించాలని స్పష్టం చేశారు. ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించి ప్రోత్సహించాలన్నారు. భవిష్యత్తులో సచివాలయాలకు క్రీడా సామగ్రితో కూడిన కిట్లను ఇచ్చే ఆలోచన చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ సిఈఓ జె.మోహన రావు, స్టెప్ సిఈఓ యస్.పల్లవి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు, డిడబ్ల్యూ అండ్ సీడీఏ పీడీ మనోరంజనీ, డిఈఓ పి.శైలజ , కాలేజీ ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జ్యోష్న కుమారి, ఇంటర్ ఆర్ఐఓ జుబేర్, టెక్నికల్ ఎడ్యుకేషన్ నుండి టి. శేఖర్ పాల్గొన్నారు.

అంగన్వాడీల 36గంటల నిరవధిక నిరసన

జయప్రదం చేయాలని అంగన్‌వాడి జిల్లా ప్రధానకార్యదర్శి జి మల్లేశ్వరి పిలుపు



మాచర్ల సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు మల్లేశ్వరి

ప్రజాశక్తి - మాచర్ల :అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించి, తెలంగాణ కంటే మెరుగైన వేతనాలు ఇవ్వాలని, పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యూటి తదితర అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌గా దేశ వ్యాప్తంగా ఈ నెల 10,11 తేదీల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని అంగన్‌వాడి సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి జి మల్లేశ్వరి కోరారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో అంగన్‌వాడి ఉద్యోగుల విస్తృత సమావేశంలో ఆమె ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ కంటే మెరుగైన వేతనాలు ఇవ్వాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటి అమలు చేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ 36 గంటల పాటు నర్సరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యాక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరసనలో మాచర్ల ప్రాంతంలోని అంగన్‌వాడీలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల మహేష్, అంగన్‌వాడి సంఘ నాయకులు ఉషా తదితరులు పాల్గొన్నారు.



పొన్నూరులో సిడిపిఒకు సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ :అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం గుంటూరు జిల్లా కలెక్టరేట్ వద్ద 36 గంటల నిరవధిక దీక్షలు చేపట్టామని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు మంగళవారం సిడిపిఒకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మకూరి రమేష్‌బాబు, వి సుకన్య, విజయలక్ష్మి, పద్మజ, కృష్ణకుమారి, సుజాత తదితరులున్నారు.

సెల్ఫీలతో ఆలపాటి ఛాలెంజ్

తెనాలి చేరిన భవిష్యత్తుకు గ్యారెంటీ టిడిపి చైతన్య రథయాత్ర

నాలుగేళ్ల వైసిపి పాలనపై టిడిపి నేతల విమర్శనాస్త్రాలు

ప్రజాశక్తి-తెనాలి



టిడ్కో గృహాలవద్ద సెల్ఫీలో ఆలపాటి, టిడిపి నేతలు

ప్రజాభవిష్యత్తుకు గ్యారంటీ టిడిపితోనే సాధ్యమని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. టిడిపి ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారంటీ పేరున చేపట్టిన చైతన్య రథయాత్ర మంగళవారం తెనాలి చేరింది. సంగం జాగర్లమూడి వద్ద యాత్ర ను పార్టీ నాయకు లతో కలిసి ఆలపాటి స్వాగతించారు. తొలుత అంగలకుదురు కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అమరావతి ప్లాట్స్, తెనాలి జిల్లా వైద్యశాల, వహాబ్ రోడ్డుమీదుగా నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపానికి యాత్ర చేరుకుంది. ఈ సందర్భ:గా ఆలపాటి అధ్యక్షతన సభ జరిగింది. ఆలపాటి మాట్లాడుతూ నాలుగేళ్ళ వైసిపి పాలనలో జగన్ సారథ్యంలో అభివృద్ధి పేరిట కొత్తరకం దోపిడీకి తెరతీశారన్నారు. పాలన అంతా అక్రమాల పుట్టన్నారు. సకల కళా వల్లభునిగా చెప్పుకుంటున్న స్థానిక శాసనసభ్యులు ఇసుక తవ్వకాల్లో, అక్రమ మట్టి తవ్వకాలతో దోచుకోవటం, విచ్చలవిడిగా మద్యం విక్రయాలు, గంజాయి, పేకాటను పెంచి పోషించారని ఆరోపించారు. ఇవేనా సకల కళలంటే ఎద్దేవా చేశారు. యాత్రలో టిడిపి హయాంలో అభివృద్ధి చేసిన జిజిహెచ్, అమరావతి ప్లాట్స్, టిడ్కో గృహసముదాయం తదితర ప్రాంతాల్లో సెల్ఫీదిగి అధికారపార్టీకి సవాలు విసిరారు. టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జగన్‌ను సాగనంపాలని, ఐదుకోట్లు ఆంధ్రుల భవిష్యత్ చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా జగన్ పాలనలో విద్యార్థులు గంజాయికి బానిసలయ్యారని దుయ్యబట్టారు. మాజీ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు మాట్లాడుతూ నువ్వే మా నమ్మకం జగనన్నా అంటూ ఇంటింటికీ స్టిక్కర్లు అంటిస్తు న్నారుగాని, ఆ నమ్మకం ప్రజల్లో లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ టిడిపి హయాంలో తెనాలిలో జరిగిన అభివృద్ధిపై సెల్ఫీ చాలెంజ్ విసిరామని, చేతనైతే వైసిపిలో జరిగిన అభివృద్ధిని చూపాలన్నారు. సభలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు తదితరులు ప్రసంగించారు. అనంతరం యాత్ర బోస్‌రోడ్డు, గాంధీచౌక్, ఐతానగర్, తేలప్రోలు మీదుగా కొల్లిపర రచ్చబండకు సాగింది. కార్యక్రమంలో స్థానిక నాయకులు పెండేల వెంకట్రావ్, వంగా సాంబిరెడ్డి, టి.హరిప్రసాద్, బ్రహ్మేశ్వరరావు, దివి అనిత, ఎ.వెంకటేశ్వరావు, డి.యుగంధర్, కె.కోటేశ్వరరావు, కె.ఏడుకొండలు, జె.మహేష్, మహ్మద్ ఖుద్దూస్, జె.మహేష్ పాల్గొన్నారు.

కెఎల్‌యు పరిశోధనా విద్యార్థిని

లక్ష్మీ సౌమ్యకు అంతర్జాతీయ అవార్డు

ప్రజాశక్తి -తాడేపల్లి రూరల్



కెఎల్ డీమ్డ్ యూని వర్శిటీ లోని బయో టెక్నాలజీ న్యూరోసైన్స్‌లో పరి శోధనా విద్యార్థిని ఈమని లక్ష్మి సౌమ్య అంత ర్జాతీయ అవార్డు సాధించారు. యుఎస్ఎకు చెందిన ఎన్విరాన్ మెంటల్ మ్యూటాజెనిసిస్ అండ్ జెనోమిక్స్ సొసైటీ అవార్డుల ఆనర్స్ కమిటీచే సౌమ్య ఎంపిక చేయబడిందని వర్సిటీ ప్రొఫెసర్ ఛాన్సలర్ డాక్టర్ కెఎస్ జగన్నాథ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్జీమర్స్ (మతిమరుపు), పార్కిన్సన్ (వణుకుడు) మొదలైన వ్యాదులకు దారితీసే మెదడులోని కణాల మరణానికి కారణమయ్యే నిర్మాణ మార్పుల ప్రభావాన్ని ఆమె ప్రతిపాదిం చిందని దానితో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న న్యూరో శాస్త్రవేత్తలు ఈ అంశాన్ని తెలుసుకు నేందుకుగాను లక్ష్మి సౌమ్యను చికాగో రావా లంటూ ట్రావెల్ అలవెన్సులను కూడా ప్రకటిం చడం హర్షణీయమని అన్నారు. మెదడు రుగ్మతలు ప్రపంచంలోని ప్రధాన సవాళ్లు 2050 నాటికి 155 మిలియన్లకు చేరుకుంటా యని లక్ష్మి తన పరిశోధనల ద్వారా నిరూపించారన్నారు. లక్ష్మి కాకినాడలోని వీఎస్ లక్ష్మి మహిళా డిగ్రీ కళాశాలలో బయోకెమిస్ట్రీలో మాస్టర్స్ చదివారని, ఆమె తల్లిదండ్రులు నాగమణి, రమణ మూర్తి మెదడుకు సంబంధించిన విషయాలను కనుగొని, తమకుమార్తె నిరుపేదలకు సాయం చేయాలని ఆసక్తిగా ఉన్నారన్నారు. లక్ష్మీ సౌమ్యను వర్సిటీ విసి జి పార్థసారధివర్మ, ప్రొఫెసర్ ఎవిఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు లక్ష్మి సౌమ్యను అభినందించారు.